క్లుప్తంగా

గోశాలకు రూ.51 వేల విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న అరుణ్‌కుమార్ దంపతులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న గోశాల సంరక్షణ పథకానికి కృష్ణగిరికి చెందిన అరుణ్‌కుమార్, మౌనిక దంపతులు రూ.51 వేలు విరాళం ఇచ్చినట్లు ఈవో ఏకాంబరం తెలిపారు. అరుణ్‌కుమార్, మౌనిక దంపతులు మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆలయానికి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం ఈవోను కలిసి విరాళం అందజేశారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



పుంగనూరు:మండలంలోని గూడూరుపల్లి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని రాగివైరును చోరీ చేసిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. రైతు నరసింహులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు గత రెండు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగివైర్లను చోరీ చేస్తున్నారని, దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

మురుగు కాలువల శుభ్రం



మురుగు కావలను శుభ్రం చేస్తున్న కార్మికులు


రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని కృష్ణమూర్తి కాలనీలో మురుగు కాలువలను ఆదివారం పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. ఆరు నెలలుగా మురుగు కాలవలను శుభ్రం చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నా పట్టించుకోలేదు. నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి దశరథశేఖర్ రెడ్డి ఆదివారం కాలువలను శుభ్రం చేయించారు. అలాగే గ్రామంలోని వీధి దీపాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి మృతి



చౌడేపల్లె: మండలంలోని 29 ఏచింతమాకులపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ రెడ్డివారి గోపాల్‌రెడ్డి(79) ఆదివారం మృతిచెందారు. ఆయన రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీలో కీలకంగా పనిచేస్తున్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అదేవిధంగా ఆయన మృతికి జెడ్పీటీసీ దామోదరరాజు, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన సుబ్రమణ్యస్వామి ఆలయం



నోటికి శూలం గుచ్చుకున్న భక్తుడు

వి.కోట: పట్టణంలో వెలసిన సుబ్రమణ్య స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆడి నెల కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కావళ్లు మోశారు. పట్టణంలోని దాసార్లపల్లి చెందిన పలువురు భక్తులు కావళ్లు ఎత్తుకుని ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఒక భక్తుడు తన నోటికి శూలం గుచ్చుకుని భక్తిని చాటుకున్నాడు.

మృతునికి నివాళి





సాయితేజ రెడ్డి(ఫైల్), మృతునికి నివాళులర్పిస్తున్న అమరనాథ్

వి.కోట: చంద్రగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ముదరందొడ్డి ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు సాయితేజ రెడ్డి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ తనయుడు అమరనాథ్ ఆదివారం ముదరందొడ్డి గ్రామానికి చేరుకున్నారు. సాయితేజ రెడ్డి భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పీ4పై కనిపించని స్పందన



సమాజంలో ఆర్థికంగా బాగున్న వారు పేదలకు సాయమందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిపై ధనిక వర్గాల వారు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎలాగైనా సూచించిన ధనిక వర్గాలను ఒప్పించాలని జిల్లా అధికారుల నుంచి కింది స్థాయి అధికారులకు ఒత్తిళ్లు తప్పడం లేదు. దీంతో అధికారులకు పీ-4 పెద్ద తలనొప్పిగా మారిందని తెలుస్తోంది. ఇప్పుడు పీ-4పై సమావేశం ఉందంటే పలమనేరు నియోజకవర్గంలోని పలు వర్గాలు ఇదేం తలనొప్పిరా స్వామీ అని తలలు పట్టుకుంటున్నారు.

- ఇప్పటికే కుదరదన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు
- ఆసక్తి చూపని ఇతర ధనిక వర్గాలు
- వారిని ఒప్పించేందుకు అధికారుల ఆపసోపాలు
- టార్గెట్ పూర్తి చేయాల్సిందేనని పైనుంచి తప్పని ఒత్తిళ్ళు

పలమనేరు: పీ-4 అంటే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ అని అర్థం. ఇందులో నలుగురుంటారు కాబట్టి వీరిని ఫోర్‌పిల్లర్స్‌గా భావిస్తూ ఈ కార్యక్రమాన్ని పీ-4గా పిలుస్తున్నారు. ప్రతి ఇంటా అభివృద్ధి, ప్రతి జీవితానికీ ప్రగతి అనే నినాదంతో ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా సమాజంలో ఆర్థికంగా బాగున్న వారు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఎన్ఆర్ఐలు కొన్ని బీపీఎల్ కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థిక సాయం చేయవచ్చు. లేదా మెంటార్స్‌గా వ్యవహరించి వారికి అవసరమైన ప్రభుత్వ పథకాలందేలా చేసి అభివృద్ధి చెందేలా చూడాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం ఈ ఏడాది నుంచి 2029 దాకా కొనసాగుతుంది.

500 మంది దాతలు ముందుకొచ్చారట

పలమనేరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు బంగారు కుటుంబాలకు సాయం చేస్తామని 500 మంది దాతలు ముందుకు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. వారిలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు వున్నట్టు పేర్కొంటున్నారు. వీరు 6,582 కుటుంబాలను దత్తత తీసుకున్నట్టు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వున్న గణాంకాలను బట్టి తెలుస్తోంది. మిగిలిన 3,524 కుటుంబాలకు త్వరలోనే దాతలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఒక దాత ఒక కుటుంబాన్ని దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపని తరుణంలో ఇక్కడ 500 మంది దాతలు 6,582 కుటుంబాలను ఎలా దత్తత తీసుకున్నారనేది అంతుచిక్కని ప్రశ్నలా మారింది.

మా బంగారాన్ని అమ్ముకోవాల్సిందే

బంగారు కుటుంబాలకోసం బంగారాన్ని అమ్ముకునే పథకంలోకి తాము రామని ఇప్పటికే పలు వర్గాల వారు అధికారులకు చెప్పినట్టు సమాచారం. తమ టార్గెట్స్ కోసం అధికారులు తంటాలు పడుతున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా మీరు బంగారు కుటుంబాలకు డబ్బుల సాయం చేయకపోయినా పర్వాలేదని, వారికి మెంటార్స్‌గా వుంటే చాలని చెబుతూ దాతల పేర్లను నమోదు చేస్తున్నారనే మాట వినిపిస్తోంది. ఇలా ఉండగా తాజాగా పెద్దపంజాణి మండల యూటీఎఫ్ సంఘం నేతలు తాము ఎవరినీ దత్తత తీసుకోలేమంటూ అక్కడి ఎంఈవోకు లిఖిత పూర్వకంగా తెలియజేయడం కొసమెరుపు. ఇదే బాటలో వ్యాపారవర్గాలు, అధికారులు ఉన్నట్టు సమాచారం.



పీ4 లోగో

వీరు సాయం చేస్తే బాగుంటుందిగా..

కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు మనసున్న మారాజులుగా ఎందుకు రావడల లేదనే మాట జనం నుంచి వినిపిస్తోంది. ముఖ్యంగా కూటమి కాంట్రాక్టర్లు, మద్యం షాపుల వారు, కూటమి మండల స్థాయి నేతలు తలా ఒక వంద కుటుంబాలను దత్తత తీసుకుంటే బాగుంటుందని పేర్కొంటున్నారు. వారిని వదిలిపెట్టి గ్రామాల్లోని చిరుద్యోగులను పీ-4లో భాగస్వాములు చేయడం సబబేనా అన్న మాట గట్టిగా వినిపిస్తోంది.



తాము దత్తత తీసుకోలేమంటూ ఎంఈవోకు విన్నవిస్తున్న పెద్దపంజాణి టీచర్లు (ఫైల్)

పలమనేరు నియోజకవర్గంలో 10 వేల పేద కుటుంబాల గుర్తింపు

పలమనేరు నియోజకవర్గంలో 104 సచివాలయాల పరిధిలో 10,105 కుటుంబాలు బీపీఎల్ కిందవున్నట్టు గుర్తించారు. ఇందులో మొత్తం పేద జనాభా 32,505 మంది ఉన్నట్టు తేల్చారు. ఈ కుటుంబాల్లో ఇప్పటిదాకా బ్యాంకు ఖాతాలు లేనివారు, గ్యాస్, కరెంట్ సౌకర్యాలు లేనివారు, మంచి నీటిని తెచ్చుకునేందుకు అరగంట సమయం పట్టే కుటుంబాలను సచివాలయ ఉద్యోగులు గుర్తించారు. వారిని ఆర్థికంగా ఎదిగేలా దాతలు తగిన ఆసరా కల్పించాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఎన్ని కుటుంబాలను వీలైతే అన్నింటిని దత్తత తీసుకుని బంగారు కుటుంబాలుగా మార్చాలని పేర్కొంటోంది.



పలమనేరు నియోజకవర్గంలో పీ-4 గణాంకాలు

సేవా కార్యక్రమాలు విస్తృతం



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పుంగనూరు: మానవత సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. ఆయన ఆదివారం పుంగనూరులో సంస్థ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సభ్యుల సహకారంతో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.1.50 లక్షలతో వేదిక నిర్మించామన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి పేద రోగులకు వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఎవరైన మరణిస్తే శవాలను భద్రపరిచేందుకు మార్చురి ఫ్రీజర్ బాక్సులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్, కార్యదర్శి నారాయణరెడ్డి, ప్రతినిధులు నందీశ్వరయ్య, బాలసుబ్రమణ్యం, భక్తవత్సలరాజు, చెంగారెడ్డి, సరస్వతమ్మ, హెచ్ఎం రుద్రాణి, ఉపాధ్యాయులు జీవి.రమణ, బాలాజీ, జగన్ మోహన్‌రెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో ప్రారంభమైన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ చింతామోహన్

కుప్పం: ఈ ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణతో దళితులకు తీరని అన్యాయం చేస్తున్నాయని మాజీ ఎంపీ చింతామోహన్ తెలిపారు. దళిత నేతలు ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ కోసం కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. మాజీ ఎంపీ చింతామోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అందరూ వ్యతిరేకిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. దేశంలో బీజేపీ పాలన అరాచకం సృష్టిస్తోందని, దీనికి రాష్ట్రంలో చంద్రబాబు సహకరిస్తున్నారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎస్సీలు ఆత్మగౌరవం కాపాడుకోవడానికి రాజ్యాంగ పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి నియోజక వర్గం కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ఆటంకాలు, అవరోధాలు కల్పించకుండా పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు. దళితులను ఇబ్బంది పెట్టిన ప్రభుత్వాలు ఇప్పటి వరకు రాష్ట్రంలో అధికారం నిలుపుకోలేకపోయాయని, భవిష్యత్తులో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం కోల్పోవడం ఖాయమన్నారు.

కుప్పంలో మితిమీరిన టీడీపీ నేతల అరాచకం



మాట్లాడుతున్న ఆవుల గోపి

కుప్పం: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో అధికార టీడీపీ నేతల అరాచకాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు ఆవుల గోపి ఆరోపించారు. రామకుప్పం మండలం, మనీంద్రం ఎంపీటీసీ శాంతకుమారి అనారోగ్యంతో మృతి చెందారని, ఆ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మనీంద్రం ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేసేందుకు వెళ్లిన కాంగ్రెస్ అభ్యర్థిని అడ్డుకోవడం, దాడి చేయడం దారుణమని ఆరోపించారు. నామినేషన్ వేయకుండా పత్రాలు చింపివేసి వాహనాల అద్దాలు పగులగొట్టి బీభత్సం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. నియోజకవర్గంలో అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు పనిచేస్తున్నారని, రాజ్యాంగ బద్ధంగా పనిచేయడం లేదని విమర్శించారు. ఉప ఎన్నికల నిర్వహణలో టీడీపీ నాయకుడు ఆనందరెడ్డి చేసిన వీరంగం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నా, పోలీసులు తెలియనట్లు వ్యవహరించడం దారుణమన్నారు.

వైభవంగా గుర్రప్పస్వామి తిరునాళ్ల



గుర్రప్పస్వామికి పూజాసామగ్రి, పుష్పాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని అరగొండలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గుర్రప్ప స్వామి తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు స్వామికి పూజాసామగ్రి, సుగంధ పరిమళ పుష్పాలు, ప్రసాదాలను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సమర్పించారు. అనంతరం గుర్రప్ప స్వామికి అభిషేకం, పూజలు చేయించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రిలో గుర్రప్ప స్వామిని పల్లకిలో ఊరేగించారు. భక్తులు ఇంటింటా పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళ హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సొంత నిధులతో పుస్తకాల పంపిణీ



తులసీనాథం నాయుడు

పలమనేరు: పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులైన తులసీనాథం నాయుడు, పుష్పా దంపతులు తమ సొంత నిధులతో ఇప్పటి వరకు మూడు రాష్ట్రాల్లోని విద్యార్థులకు రెండు లక్షల పుస్తకాలు పంపిణీ చేశారు. వాటిలో 1.50 లక్షల నీతిపద్యాల పుస్తకాలు, పెద్దబాలశిక్ష, బొమ్మల భారతం, రామాయణం, పంచతంత్రం, సిన్నబ్బ కథలు, తెనాలి రామక్రిష్ణ, తెలుగు వ్యాకరణం, దేశనాయకుల చరిత్ర తదితర 50 వేల పుస్తకాలు పంచిపెట్టారు. రెండు లక్షల పుస్తకాలు పంపిణీ పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక సాహితీ అభిమానులు ఆ దంపతులను సన్మానించారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక శనివారం సాయంత్రం పొలం వద్ద కు వెళ్లి తిరిగి రాలేదు. బాలిక తండ్రి పలుచోట్ల వెతికినా ఆచూకీలేదు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టామని ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు.

ఏనుగులతో అప్రమత్తంగా ఉండాలి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు సమీపంలోని పదిపుట్ల బైలు రిజర్వు ఫారెస్టులో ఏనుగులు సంచరిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఫారెస్టు అధికారులు తెలిపారు. రాత్రిళ్లు పొలాల వద్ద పడుకోవద్దని, ఏనుగులు కనిపించినా తరమవద్దని హెచ్చరించారు. ఏనుగుల సమాచారం తెలిసిన వెంటనే 9550067503 నంబర్‌కు కాల్ చేసి తెలపాలని తెలిపారు. తెల్ల బట్టలు ధరించవద్దని, ఏనుగుల అలికిడి వినిపించినా అదిలించడం, తరమడం చేయకూడదన్నారు. ఈ మేరకు వారు ఆదివారం స్థానికులకు అవగాహన కల్పించారు.

నేడు గంధం.. రేపు ఉరుసు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం దర్గా సర్కిల్‌లోని దర్గాలో రెండు రోజులు గంధం, ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు జరుగుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఊరేగింపు ఉంటుందన్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గం ఎంపిక



వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గం ఎంపిక కార్యక్రమం జరుగుతున్న దృశ్యం

పలమనేరు: విశ్వహిందూ పరిషత్తు నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పట్నం సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులుగా భాస్కర్‌రావు, శంకర్, కార్యదర్శిగా బండి రమేష్‌రెడ్డి, సహ కార్యదర్శిగా బాలాజీ, కోశాధికారిగా సురేష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

సదుం: మండలంలో సోమవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 8.45 గంటలకు తిమ్మనాయునిపల్లె, 10.15 గంటలకు రెడ్డివారిపల్లె, 11.15 గంటలకు చింతపర్తివారిపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

ఓం శక్తి అమ్మవారికి మహిళల మొక్కులు



ఓంశక్తి అమ్మవారికి పూజలు చేసేందుకు వస్తున్న మహిళలు

పుంగనూరు: పట్టణంలోని నక్కబండ రోడ్డులో వెలసిన ఓం శక్తి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మట్టి కుండల్లో గంజి తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. ఓంశక్తి... పరాశక్తి అంటు మేళతాళాలతో ప్రదర్శన చేశారు. అమ్మవారికి గంజితో అభిషేకం చేశారు. శ్రావణమాసంలో రెండో ఆదివారం ఓంశక్తి అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

పలమనేరు: నియోజకవర్గ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీటీ బాలసుబ్రమణ్యం, గౌరవాధ్యక్షుడిగా సాంబయ్య, కార్యదర్శిగా రవి, కోశాధికారిగా రఘు, ఉపాధ్యక్షులుగా అనిత, పురుషోత్తం, సహాయ కార్యదర్శిగా గురుమూర్తి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రమణ్యం, ఆనంద్‌బాబు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

గుడివంక ఆలయంలో భక్తుల సందడి



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

గుడుపల్లె: ఆడి నెల ప్రారంభమై 18 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గుడివంకలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆడి-18 వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కావళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వస్త్రాలు, రంగురంగుల పూలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు భక్తిశ్రద్ధలతో వివిధ రకాలు కావళ్లతో ఆలయానికి వచ్చి పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి గంగపూజలు చేశారు. అనంతరం కొండపైకి చేరుకుని ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి కావళ్లు సమర్పించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

భారంగా మారిన వీఐపీ అంబులెన్స్‌లు

జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో వీఐపీ ప్రొటోకాల్ అంబులెన్స్‌లు భారంగా మారాయి. ఎప్పుడో ఒక సారి ఆ ప్రాంతాల్లో వీఐపీలు పర్యటనకు వచ్చినప్పుడు అగ్నిమాపక వాహనంతోపాటు ప్రొటోకాల్ అంబులెన్స్‌లు వినియోగిస్తూ వుంటారు. మిగిలిన రోజుల్లో ఇవి ఆస్పత్రుల్లో అలంకారప్రాయంగా వుంటున్నాయి. వీటి నిర్వహణ, డీజల్, డ్రైవర్ జీతాలను సంబంధిత ఆస్పత్రులకు వచ్చే నిధుల నుంచి ఖర్చు చేయడం భారం మారింది. ఈ క్రమంలో ఈ వాహనాలు తమకొద్దంటూ సంబంధిత ఆస్పత్రి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నారు.

- ఆస్పత్రుల నిధులతో వాటి నిర్వహణ
- సమస్యలకే సరిపోని నిధులు
- అదనపు భారమంటున్న ఆస్పత్రి అధికారులు



పలమనేరు ఆస్పత్రి షెడ్‌లో ఉన్న వీఐపీ ప్రొటోకాల్ అంబులెన్స్

పలమనేరు: వీఐపీలు వచ్చినప్పుడు వినియోగించేందుకు గాను అంబులెన్స్‌లను నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా పలు ఆస్పత్రులకు కేటాయించారు. వీఐపీలు ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇందులో వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు, ఆక్సిజన్ తదితరాలతో సిద్ధంగా ఉండాలి. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీటీడీ నిర్వహణలో వున్న రుయా, స్విమ్స్‌లోని ప్రొటోకాల్ వాహనాలకు పెద్దగా నిధుల సమస్యలేదు. ఇక చిత్తూరులోని అంబులెన్స్‌ల నిర్వహణ అపోలో వారు చూసుకుంటున్నారు. కుప్పానికి సంబంధించిన వాహనం నిర్వహణ బాధ్యతను పీఈఎస్ మెడికల్ కళాశాల వారు చేపట్టారు.

పలమనేరులో తప్పని భారం

పలమనేరు ఏరియా ఆస్పత్రికి ఇచ్చిన ప్రొటోకాల్ అంబులెన్స్‌కు మొన్నటి వరకు డ్రైవర్ కూడా లేదు. అవసరం వచ్చినప్పుడు డీసీహెచ్ఎస్ కార్యాలయం నుంచి డ్రైవర్ రావాల్సిందే. ఈ వాహనానికి సర్వీసు చేయించడం, డీజిల్, ఇతర మరమ్మతులకు స్థానిక ఆస్పత్రి నిధులనే వాడుతున్నారు. ఈ క్రమంలో నిర్వహణ కష్టంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తన నిధుల నుంచి డ్రైవర్‌కు జీతం ఇస్తామని చెప్పినట్టు తెలిసింది. వాహనం నిర్వహణ బాధ్యతను ఆస్పత్రి నుంచి కాకుండా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం చూసుకుంటే బాగుటుందనే మాట వినిపిస్తోంది. ఈ విషయమై స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణిని వివరణ కోరగా వీఐపీ అంబులెన్స్ తమకు భారంగా మారినమాట నిజమేనన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తన నిధుల నుంచి డ్రైవర్‌కు జీతాలు ఇస్తామని చెప్పారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆడిపూజలు

గుడిపాల: బంగారక్క అమ్మవారికి ఆడిపూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం వసంతాపురం గ్రామంలోని మహిళలు పొంగళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉదయం ఉపవాసాలతో అమ్మవారి వద్దకు వెళ్లి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు.